క్లుప్తంగా

కొక్కిరేణిలో ఉచిత పశు వైద్యశిబిరం



గేదెకు వైద్యం చేస్తున్న వైద్యుడు

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణిలో శుక్రవారం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధుల నివారణ, ఎదకురాని పశువులకు మందులు, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, వెటర్నరీ డాక్టర్ అనూష, సర్పంచ్ గంటా నిర్మల, ఎంపీటీసీ అంబేద్కర్, వెటర్నరీ వైద్య సిబ్బంది అశోక్, సురేష్, కరుణాకర్, రమణ, మహేష్, రైతులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రామకృష్ణ చిరస్మరణీయుడు

ఖమ్మంమయూరిసెంటర్: బషీర్‌బాగ్‌లో జరిగిన పోలీస్ కాల్పుల్లో మరణించిన సత్తెనపల్లి రామకృష్ణ చిరస్మరణీయుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలో రామకృష్ణ 23వ వర్ధంతి సభ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ నియంత్రణ అమలు చట్టం తీసుకొచ్చిందని, దీంతో పేద ప్రజలు, రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నాటి విద్యుత్ పోరాటం తరువాత వచ్చిన ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచేందుకు సాహసించలేకపోయాయని, దీనికి కారణం నాటి విద్యుత్ అమరవీరుల పోరాటస్ఫూర్తేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు శ్రీకాంత్, రమేష్, శ్రీనివాస్, దొంగల తిరుపతిరావు, నవీన్‌రెడ్డి, బండి పద్మ, పిన్నింటి రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారైనా ఉమ్రా యాత్ర చేయాలి



బ్యాగు అందజేస్తున్న ఎండీ జవ్వాద్ అహ్మద్

ఖమ్మంమామిళ్లగూడెం: మానవ జీవితంలో ఒక్కసారైనా ఉమ్రా యాత్ర చేసి జన్మకు సార్థకత చేసుకోవాలని తవ్వాఫ్ అండ్ టూర్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ సంస్థ అధినేత హఫీజ్ ఎండీ జవ్వాద్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఈ నెల 9న ఉమ్రా వెళ్లే యాత్రికులకు ఖమ్మంలోని కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గాన్ని యాత్రికులు అనుసరిస్తూ ఎదుటి వ్యక్తులకు హాని తలపెట్టకుండా అల్లాహ్ మార్గంలో నడవాలని సూచించారు. ఈ సందర్భంగా యాత్రికులకు ఉచిత ట్రావెల్ బ్యాగులు, షోల్డర్ బ్యాగులు, కుట్టులేని వస్త్రాలు అందజేశారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం..



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రచారం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్‌లు మహిళల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌ను ప్రతీ ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రభుత్వాల మహిళల వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దళితబంధు, బీసీ, మైనార్టీ రుణాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అందిస్తున్నారని, గృహలక్ష్మి పథకంలో అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సభ్యులు పరహానా, ఎంపీటీసీలు రేగూరి వాసవి, దోసపాటి కల్పన, నాయకురాలు చట్టు లక్ష్మి, ఎం.ఉషారాణి, బాబులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్‌శెట్టి మిస్టర్‌పొలిశెట్టి
ఆదిత్య	ఓఎంజీ 2(హిందీ)
శ్రీనివాస	జవాన్
సుందర్	తురుమ్ ఖాన్‌లు

\- ఖమ్మంగాంధీచౌక్

మంత్రి పువ్వాడ నాలుగేళ్ల సంబరాలు

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం మయూరిసెంటర్: మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీఎన్జీవోస్ ఆధ్వర్యాన సంబరాలు నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని మాతా శిశు కేంద్రం ఆవరణలో ఉద్యోగుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి పువ్వాడ కట్ చేశారు. ఈ నేపథ్యంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్, ఉద్యోగ జేఏసీ నాయకులు టి.సునీల్ రెడ్డి, శ్రీనివాసరావు, హకీం, బిక్కులు సహచర ఉద్యోగులతో కలిసి మంత్రిని ఘనంగా సన్మానించారు. మహిళ ఉద్యోగులు మంత్రిని శాలువతో సత్కరించారు. ఉద్యోగులు మంత్రికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ మంత్రికి ఖమ్మం నియోజకవర్గంతో పాటుగా జిల్లాలో చేసిన అభివృద్ధిని స్వహస్తలతో రాసిన అభినందన లేఖను ఫొటోఫ్రేమ్‌లో పొందుపర్చి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మంత్రిగా భవిష్యత్‌లో మరింతగా ప్రజా ఆశీస్సులు పొంది మరెన్నో పదవులు చేపట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను,రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ రావు,మహిళా విభాగం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శాబాసు జ్యోతి,స్వప్న,రఘునాధపాలెం యూనిట్ అధ్యక్షురాలు శిరణ్మయి, టౌన్ ప్రెసిడెంట్ నాగుల్ మీరా , భాగం పవన్, వై.శ్రీనివాసరావు,కత్తుల రవి, శ్రీదేవి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పలు పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, వైద్యులు మంత్రిని కలిసి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి, మంత్రికి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం , జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, ఖమ్మం, కొత్తగూడెం ఆర్టీఓ సభ్యులు వల్లభనేని రామారావు, గూడపాటి శ్రీనివాస్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. అంతేకాకుండా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నాయకులు మంత్రిని సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఖాజామియా, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు నయీమ్ పాష, కోశాధికారి శేషప్రసాద్, సంజయ్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య క్యాంపు కార్యాలయంలో మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, టీఎన్జీవోస్ బాధ్యులు



మంత్రికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ పునుకొల్లు నీరజ



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీవోస్ నాయకులు

శ్రీ కృష్ణ శోభాయాత్రను ప్రారంభించిన మంత్రి..

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా నగరంలోని త్రీటౌన్ శ్రీ మురళీ కృష్ణ మందిరంలో శ్రీ కృష్ణుని శోభాయాత్రను శుక్రవారం రాత్రి మంత్రి అజయ్‌కుమార్ ప్రారంభిచారు. ఈ సందర్భంగా మందిర చైర్మన్, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మంత్రిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆర్జేసీ కృష్ణ, స్థానిక కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, పసుమర్తి సాంబశివరావు, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పువ్వాడను శాలువాతో సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి

మినరల్ వాటర్ ప్లాంట్‌ను..

ఖమ్మం వైద్యవిభాగం: కురువెళ్ల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి అజయ్‌కుమార్ శుక్రవారం ప్రాంభించారు. మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రూ. 5లక్షల వ్యయంతో రోగుల సౌకర్యార్థం ప్లాంట్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో కురువెళ్ల రామారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం ఉండొద్దు..



రఘునాథపాలెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపాలెం/నేలకొండపల్లి/కామేపల్లి(కారేపల్లి): కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా, అర్హులకు అందజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యాన ఆయా మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రఘునాథపాలెంలో నిర్వహించిన ధర్నాలో ప్రజాపంథా పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు ఆవుల మంగతాయి, మండల కమిటీ కార్యదర్శి కేళోతు లక్ష్మణ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, కామేపల్లిలో నిర్వహించిన ధర్నాలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ లు మాట్లాడుతూ.. దళితబంధును గ్రామ సభలు పెట్టి అర్హులను గుర్తించి అందజేయాలని, కమీషన్లకు కక్కుర్తి పడి దళిత బంధులను అమ్ముకోకుండా చూడాలన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్కీములు బీఆర్‌ఎస్ పథకాలుగా మారుతున్నాయని, ఎన్నికల ముందు ప్రకటించే పథకాలు మోసపూరితమని ఆరోపించారు. గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలకు బదులుగా రూ.5 లక్షలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లాటరీ సిస్టం ద్వారా అర్హులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, సీపీఎం పార్టీ మండల కార్యదర్శులు కే.వీ.రెడ్డి, ఎస్.నవీన్ రెడ్డి, నాయకులు కూరాకుల నర్సయ్య, జాటోత్ ప్రేమ్ సింగ్, భూక్య లక్ష్మణ్ భూక్యాసక్రు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, హిమాం, అబ్దుల్ , ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, మూర్తి కొండలు, చింతలపాటి భాస్కర్, కె.వీ.చారీ, శీలం అప్పారావు, నాగభూషణం, బాదావత్ శ్రీనివాస్, కాటినేని కృష్ణమూర్తి, శాంతయ్య, ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో పోషణ్ మాసోత్సవం

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలో పోషణ్ మాసోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించి, పోషణపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆరోగ్యలక్ష్మి భోజనంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ దయామణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ బరిలో నిలిచేందుకు దరఖాస్తులు



దరఖాస్తులు చేస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: ఖమ్మం అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీలో నిలిచేందుకు కొందరు నాయకులు శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్‌తో పాటు మన్‌కీబాత్ రాష్ట్ర కన్వీనర్ గెంటెల విద్యాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దొడ్డా అరుణ, ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, వెంకన్న, భవాని తదితరులు రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.

పాలేరు నుంచి రవికుమార్..

నేలకొండపల్లి: పాలేరు స్థానాన్ని తనకు కేటాయించాలని బీజేపీ తరపున ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందించారు. తనకు అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు పీఆర్‌టీయూ కార్యాలయం ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ఎల్ఐసీ కార్యాలయం వెనుక నూతనంగా నిర్మించిన పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయాన్ని ఈనెల 10వ తేదీన ప్రారంభించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కురి మధు, ఆర్.రంగారావు తెలిపారు. ఈ కార్యాలయాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

డ్రై డే పకడ్బందీగా చేపట్టాలి



నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: డ్రైడేను పకడ్బందీగా చేపట్టాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్‌లలో డ్రైడే కార్యక్రమాల నిర్వహణను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని, పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి రెండు మూడు రోజులకోసారి నిల్వ నీటిని పడబోయాలని సూచించారు. మురికి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

10న చాకలి ఐలమ్మ వర్ధంతి

నేలకొండపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని బీసీ జేఏసీ పాలేరు డివిజన్ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న నిర్వహించే చాకలి ఐలమ్మ వర్ధంతికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు.

తహసీల్దార్‌కు అంగన్‌వాడీల సమ్మె నోటీస్..



తహసీల్దార్‌కు నోటీస్ అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంరూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్న శుక్రవారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్, మినీ వర్కర్స్ యూనియన్ నాయకులు తహసీల్దార్ బీ.వీ.రామకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు పిన్నింటి రమ్య మాట్లాడుతూ.. దేశంలో ఐసీడీఎస్ ప్రారంభించి 48 ఏళ్లు అవుతుందని, అయినా తెలంగాణ ప్రభుత్వ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగులంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారని, వారి సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి తమ న్యాయమైన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పి.మోహన్‌రావు, భాగ్యమ్మ, పుష్పావతి, సరిత, శ్రీలత, లక్ష్మి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ఎమ్మెల్యే విస్తృత పర్యటన



పోచారంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కూసుమంచి: మండలాల్లో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా కూసుమంచి గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరగా.. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే పోచారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ముత్యాలమ్మ తల్లి, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ శశికళ, ఎంపీటీసీ అంజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, కార్యదర్శి ఆసిఫ్‌పాషా, సీతారాములు, ఉపేందర్, నాగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు కందాళ, సండ్ర..

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన చిర్ర కృష్ణయ్య–నర్సమ్మ దంపతుల కుమారుడి వివాహ వేడుక ఖమ్మం రూరల్ మండలంలోని ఓ గార్డెన్స్‌లో నిర్వహించగా.. పాలేరు, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్యలు హాజరై నూతన వధూవరులు యుగేష్ వర్షలను ఆశీర్వదించారు. అలాగే వైఎస్సార్‌టీపీ నాయకుడు సంద్యాల రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్త బాలాజీరావు, మండల అధ్యక్షులు వాలూరి సత్యనారాయణ, తోట చిన్న వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, శ్రీను, మనోహర్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సీహెచ్‌సీ ఎదుట ప్రజా సంఘాల ధర్నా..

పదోన్నతిపై వైద్యాధికారిని బదిలీ చేయొద్దని డిమాండ్



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ప్రతీ రోజు 200లకు పైగా ఓపీలు కలిగిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటువంటి సమయాన ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా పని చేస్తున్న డాక్టర్ కె.రాజేష్‌కు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి మధిర ఆస్పత్రికి బదిలీ చేశారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి రాజేష్‌కు పదోన్నతి కల్పించినా.. ఇక్కడే డిప్యూటేషన్‌పై ఉంచాలని డిమాండ్ చేశారు. వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరితే.. ఉన్న ఒక్క వైద్యుడిని బదిలీ చేయటం సరైనది కాదని మండిపడ్డారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ ఉద్యోగులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, కాశిబోయిన అయోధ్య, పగిడికత్తుల రామదాసు, పసుమర్తి శ్రీనివాస్, చిర్రా భిక్షం, దాసరి వంశీ, మెట్టెల సాయి, పగిడికత్తుల నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్థానిక గుట్టల బజార్‌లోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతంను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల అధ్యక్షుడు గోంగూర వెంకటేశ్వర్లు, హెచ్ఎం సంతోష గౌతమ్‌లు తెలిపారు. లక్ష్మీదేవి అంటే శుభ్రం అని శుభ్రం ఉన్న చోట లక్ష్మి ఉంటుందని, ఇదే మనం ఈ తరం పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సురేఖ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని విద్యుత్ సెక్షన్ల పరిధిలో ఉన్న సబ్ స్టేషన్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని శుక్రవారం ఆయా సెక్షన్ల విద్యుత్ అధికారులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఖమ్మం టౌన్–1 సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ దానవాయిగూడెం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని ఏఈ మౌల్విక ఒక ప్రకటనలో తెలిపారు. దానవాయిగూడెం, జైలు రోడ్ సారథినగర్, వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, జూబ్లీక్లబ్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని చెప్పారు.

టౌన్–2 పరిధిలో..

ఖమ్మం టౌన్–2 పరిధిలోని మామిళ్లగూడెం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామాలయం సెంటర్, బస్ డిపో వెనుక ప్రాంతం, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనుక మామిళ్లగూడెం ప్రాంతంలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

టౌన్–3 పరిధిలో..

ఖమ్మం టౌన్–3 సెక్షన్ ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీడీవోస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, సహకారనగర్, ద్వారకానగర్, గట్టయ్య సెంటర్, గవర్నమెంట్ ఆస్పత్రి, పాత కలెక్టరేట్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ బి.తావుర్యా పేర్కొన్నారు.

టౌన్–4 పరిధిలో..

టౌన్–4 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ ధంసలాపురం సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 11:20 గంటల వరకు శ్రీరాంనగర్, సీతారామనగర్1 నుంచి 13 రోడ్లు, ముస్తాఫానగర్, కొత్తూరు, ధంసలాపురం, సీతారాంపురం, ఎస్‌బీఐటీ రోడ్, పార్శీబంధం, పాకబండ బజార్, చర్చి కాంపౌండ్, బోనకల్ క్రాస్ రోడ్‌లలో కరెంట్ ఉండదని ఏఈ జె.శ్రీధర్‌రెడ్డి చెప్పారు.

టౌన్–5 పరిధిలో..

టౌన్–5 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ రామాలయం సబ్‌స్టేషన్ లైన్ల క్లియరెన్స్ పనుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కమాన్ బజార్ కస్బా బజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా ఏరియా, స్టేషన్ రోడ్, బొమ్మన సెంటర్, శాంతిలాడ్జి ఏరియా, వినోద థియేటర్ ఏరియా, ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, ఖిల్లా, శుక్రవారపు పేట, బ్రాహ్మణ బజార్, రిక్కాబజార్, చర్చి కాంపౌండ్ ఏరియా, రామకృష్ణ నగర్, సుగ్గలవారి తోట, మేదర బజార్, అమ్మ భవాని టెంపుల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

ముచ్చర్ల సబ్ స్టేషన్ పరిధిలో..

కామేపల్లి(కారేపల్లి): మండలంలోని ముచ్చర్ల సబ్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల, జాస్తిపల్లి, ముచ్చర్ల టౌన్ ఫీడర్, సాతానుగూడెం, బాసిత్‌నగర్, బంజర ఫీడర్, రాజీవ్ నగర్, నారాయణపురం, సుభీతండా, మద్దులపల్లి, లల్యాతండా, కెప్టెన్ బంజరలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.

ఖానాపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖానాపురంలోని 33 కే.వీ. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, వైరారోడ్డు, రోటరీనగర్, పోలీసు కాలనీ, గోపాలపురం, పుట్టకోట, గొల్లగూడెం,కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరపరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

‘సొసైటీ’ ఎన్నికలకు వేళాయె..

- 22న చెరువుమాధారం చెరువు ఎన్నికలు
- ఓటర్ల జాబితా విడుదల, ఎన్నికల అధికారి నియామకం

నేలకొండపల్లి: జిల్లాలోని అతి పెద్దదైన నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం చెరువు మత్స్య సొసైటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మూడేళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో చెరువులో చేపల వేట సాగడంలేదు. సొసైటీ పరిధిలో చెరువుమాధారం, రాయగూడెం, మంగాపురంతండా, చిన్నతండా, బుద్ధారం, రాజారాంపేట గ్రామాల సభ్యులు ఉండగా, వీరి నడుమ వివాదంతో ఎన్నిక జరగలేదు. ఇక కొత్త సభ్యులకు అవకాశం ఇవ్వడంపై కొందరు కోర్టును ఆశ్రయించగా జాప్యం జరుగుతూ వచ్చింది. ఎట్టకేలకు చెరువుమాధారం మత్స్య సొసైటీలో 832 మంది సభ్యులను నిర్ధారణ చేస్తూ శుక్రవారం అధికారులు ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఇక సహకార శాఖకార్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్‌ను ఎన్నికల అధికారిగా నియమించడంతో పాటు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 15న స్క్రూటినీ, 16న ఉపసంహరణ ఉంటుందని, ఆ తర్వాత 22న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పోలింగ్ నిర్వహించి అదేరోజు ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

రిజర్వేషన్ల ఆధారంగా..

చెరువుమాధారం సొసైటీలో మొత్తం తొమ్మిది డైరెక్టర్ల పోస్టులకు ఎన్నికలు జరగనున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఒక డైరెక్టర్ పదవితో పాటు మహిళలకు రెండు, జనరల్ కేటగిరీ ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఆతర్వాత వీరి నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కాగా, ఎన్నికలలో విజయం సాధించేందుకు సభ్యులుగా రెండు ప్యానళ్లుగా విడిపోగా, మూడేళ్ల తర్వాత ఎన్నికలు జరగనుండడంతో అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.